క్లుప్తంగా

వసతి గృహాల నిర్వహణపై సమీక్ష



హాస్టల్ వార్డెన్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహాల నిర్వహణపై ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సోమవారం సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో ఎంతమంది పిల్లలు ఉంటున్నారు. వారికి మెనూ ప్రకారం సక్రమంగా భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండలాలకు చెందిన ఎంపీపీలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, ఉప్పాడ అనూషరెడ్డి, వివిధ వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం



లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక శాంతినగర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఎం.లక్ష్మణరావుకు విజయనగరం డ్రైవర్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కొద్దిరోజుల కిందట జరిగిన ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారడంతో తోటి ఆటోడ్రైవర్లు స్పందించి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.27,604 నగదు, రూ.4 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రాజేష్, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ రంగనాథన్ సేవలు మరువలేనివి

డెంకాడ: గ్రంథాలయ శాస్త్రంలో దివంగత డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ రచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయని లైబ్రేరియన్ వై.మహేష్ అన్నారు. డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని డెంకాడ శాఖాగ్రంథాలయంలో ఆయన చిత్రపటం వద్ద పుష్పాలను ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. 1931లో రంగనాథన్ రచించిన 'ఫైవ్ లా ఆఫ్ లైబ్రరీ' (పంచ సూత్రాలు) గ్రంథాలయాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

కళాక్షేత్రాల్లో వసతులు కల్పించండి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా కేంద్రంలో కళాకారులకు, కళాభిమానులకు అందుబాటులో ఉండే విధంగా ఆనందగజపతిరాజు కళాక్షేత్రం, గురజాడ కళాభారతిని అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సోమవారం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఆయా కళాక్షేత్రాల్లో కనీస సౌకర్యాలు లేక కళాకారులు, కళాభిమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆయనతో పాటు వేదిక ఉపాధ్యక్షుడు పి.ప్రభాకరరావు, జె.రామచంద్రరాజు, ఎ.నాగభూషణం, రాజు, తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



ప్రతిజ్ఞ చేస్తున్న అవంతీ కళాశాల విద్యార్థులు ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్రగ్స్(మాదకదవ్యాలు) భవిష్యత్‌ను నాశనం చేస్తాయని ఎస్ఐ ఎల్.దామోదరరావు అన్నారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, వాటి నియంత్రణపై గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యం లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఒకసారి మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం పక్కదారి పడుతుందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అంతా సహకరించాలని కోరారు. సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్‌ను దరి చేరనీయబోమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

గంట్యాడ: మాదక ద్రవ్యాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని సూచించా రు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని పెదవేమలి గ్రామ సచివాలయంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారి ఎంతో మంది భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



విజయనగరం: డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక



మాట్లాడతుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి

విజయనగరం: గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ముందుగా డ్రగ్ 'ఫ్రీ ఇండియా' ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించటంతో పాటు వాటి అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వారాజ్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

భోగాపురం: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఏవిధంగా స్పందించాలి అనే అంశంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన బిల్లులను ఏవిధంగా తయారు చేయాలి, పంచాయతీ చట్టంలోని అంశాలు, గ్రామసభల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం మొదలగు అంశంలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ..అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలను ప్రగతిపథంలోకి తీసుకురావాలి

పూసపాటిరేగ: పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించేలా చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ విధులు, బాధ్యతలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, తహసీల్దార్ తాడ్డి గోవింద, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనల హోరు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

విజయనగరం అర్బన్: వివిధ సంఘాల నేతల నిరసనలతో సోమవారం కలెక్టరేట్ ప్రాంగణం హోరెత్తింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ సభ్యులు నిరసన తెలిపారు. అంతకుముందు పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. బాలాజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, మయూరీ కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట నినాదాలు చేశారు. దళిత వర్గాలకు ఎప్పటికీ రాజ్యాధికారం దక్కనీయకుండా చేయాలని కుట్రతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో పోరాట సమితి నాయకులు పీరుబండి జైహింద్, డాక్టర్ పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి: ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు నేపథ్యంలో తమ ఉద్యోగాలను రద్దు చేయకుండా చూడాలని కోరారు. అందరికీ 30 ఏళ్ల వయసు దాటిందని, ఉద్యోగాలు తీసేస్తే మరో ఉపాధి అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా అంతర్జాతీయ యువ దినోత్సవం



సన్యాసినాయుడును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని సోమవారం ఉదయం స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్ద ఉన్న మైదానంలో నిర్వహించారు. ముందుగా అంతర్జాతీయ మాస్టర్స్ థాయిలాండ్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్ వాల్ట్ విభాగంలో బంగారు పతకం సాధించిన యువ క్రీడాకారుడు, ఏఆర్ కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసినాయుడును క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ.. యువత దేశానికి వెన్నుముక అని అన్నారు. చిత్తశుద్ధితో కృషిచేస్తే దేన్నయినా సాధించవచ్చన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి కీర్తిప్రతిష్ఠలె తెచ్చిపెట్టిన సన్యాసినాయుడును యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ.. ఇటువంటి సత్కారాలు జీవితంలో మరింత ముందుకెళ్లేందుకు రెట్టింపు ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీను, క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, జాలీవాకర్ కిలారి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ డ్యూటీ అటెండెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్, మార్చురీ అసిస్టెంట్స్‌గా పనిచేస్తున్న సిబ్బంది తమకు వేతన బకాయిలు ఇప్పించాలని కోరుతూ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఎంపీని కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో 43 మంది పనిచేస్తున్నామని, తమకు 12 నెలలుగా జీతాలు చెల్లించలేదని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోయారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్కోస్‌లో సిబ్బంది వివరాలు సకాలంలో నమోదు చేయకపోవడం వల్ల తమకు జీతాలు రాలేదని తెలిపారు. ప్రస్తుతం అప్కోస్ వెబ్ సైట్ ఓపెన్ కావడంలేదని అధికారులు చెపుతున్నారని, తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.రామకృష్ణ, షాన్, కె.రాజు, బి.హరి, కళ్యాణ్, శ్రీనివాస్‌రావు, నూకరాజు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

డెంకాడ: ఈనెల 16 నుంచి వచ్చే నెల 28 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న చిట్టిగుంకలాం, బెల్లాం గ్రామాల్లో, 17న రఘుమండ, వెదుళ్లవలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 20న పినతాడివాడ, 22 పెదతాడివాడ, 24న అక్కివరం, 27న చొల్లంగిపేట, డీఆర్ పాలెం, 28న డి.కొల్లాం, ముంగినాపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. 29న బంటుపల్లి గ్రామంలో, 31న బొడ్డవలస, వచ్చే నెల 3న పేడాడ, రాజులతమ్మాపురం గ్రామాల్లో, 5న గంట్లాం, గొలగాం, 6న అమకాం, 10న జొన్నాడ, 11న డెంకాడ, 12న సింగవరం, 13న నాతవలస, 17న చింతలవలస, 19న బంగార్రాజుపేట, డి.తాళ్లవలస గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి. 24న మోపాడ, 26న గుణుపూరు, 28న మోదవలస రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

నెల్లిమర్ల: ఈనెల 16 నుంచి 28 వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.సుదర్శనరావు సోమవారం తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కబేళాలపై పోలీసుల దాడి

విజయనగరం క్రైమ్: జిల్లాలో కబేళాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గంజాయి, పశుమాంసం రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, మైనర్ బైక్ రైడింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కంటోన్మెంట్‌లో ప్రాంతంలో స్టార్ బిర్యానీ పక్కన ఉన్న కబేళాపై దాడిచేసి 1100 కిలోల గోవు మాంసం, 13 కోసిన ఆవులను, బతికి ఉన్న 37 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కలెక్టరేట్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కబేళాపై దాడి చేసి 20 గోవులను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడు వాహనాలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి



ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. పని సర్దుబాటులో జరుగుతున్న అసంబద్ధతను తొలగించకుండా ఈ ప్రక్రియను చేపట్టడాన్ని తప్పుపట్టారు. సర్దుబాటు జీఓను వెనుక్కి తీసుకోకపోతే కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 9న విద్యాశాఖ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఈ అంశాలను ప్రస్తావించినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సీనియార్టీ అనే చిన్న డిమాండ్ మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ ఉపాధ్యాయ వ్యతిరేక జీఓలు 117, 128 ఆధారంగా పని సర్దుబాటు చేస్తున్నారని ఆరోపించారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సహారా ఇండియా బాధితులు పోరాట కమిటీ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ, బాధితులపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 14న జిల్లా వ్యాప్తంగా చేపట్టే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని బాధితుల పోరాట కమిటీ సలహాదారుడు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిరసనలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహారా ఇండియా బాధితులకు డబ్బులు చెల్లించకపోవటంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. బాధితుల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం(ఎన్‌పీఎం దుకాణం)ను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాన్ని ప్రకృతి వ్యవసాయ ఉత్తర కోస్తా రీజనల్ అధికారి ప్రకాశ్‌రావు, అడిషినల్ డీపీఎం స్వామి నాయుడు, ఏఓ శైలజ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడలు, పురుగుల నివారణకు సంబంధించిన కషాయాలు, ద్రావణాలు ఈ కేంద్రంలో లభిస్తాయన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. కషాయా లు,ద్రావణాలతో తెగుళ్ల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు.ఈకేంద్రంలో ఏ-గ్రేడ్ రకం కూరగాయల విత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. వీఏఏ ప్రియాంక, ప్రకృతి వ్యవసా య సిబ్బంది శంకర్, సూర్యకుమారి, సింహాచలం, రాము, అనసూయ, సుశీల, రామకృష్ణ, గోవింద రావు, కృష్ణారావు,రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 వినతులు వచ్చాయి. కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వినతులు స్వీకరించారు. శానిటేషన్‌కు సంబంధించి 1, హౌసింగ్‌కు సంబంధించి 2, ఇతర సమస్యపై 1 చొప్పున వినతులు అందాయి. వాటిని సంబంధిత విభాగాల అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలో దోమల నియంత్రణకు ప్రతిరోజు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఏసీపీ అమ్మాజీరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ కార్తీక్ సేవలు ప్రశంసనీయం



జేసీని సత్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఆర్ఓ అనిత

విజయనగరం అర్బన్: జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొనియాడారు. నెల్లూరు జిల్లా జేసీగా బదిలీపై వెళ్తున్న కర్తీక్‌ను సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జేసీ చేసిన సేవలను అభినందించారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన, పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. జేసీ కార్తిక్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లాకు కలెక్టర్‌గా రావాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత కార్తీక్ మాట్లాడుతూ.. ఇక్కడ పనిచేసింది కేవలం ఆరున్నర నెలలే అయినప్పటికీ సొంత జిల్లాగా భావించానని అన్నారు. ఇక్కడి అధికారులు, ప్రజలతో బలమైన బంధం ఏర్పడిందని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానట్లు చెప్పారు. అనంతరం డీఆర్ఓ ఎస్‌డీ అనిత, డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ, జేడీ తారకరామారావు, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి సందేప్‌కుమార్, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద, నాయకులు సూర్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు జేసీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులను ఆపండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు రమణ, తదితరులు

శృంగవరపుకోట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజకీయ వేధింపుల్లో భాగంగా చిరుద్యోగులపై వేటు వేసి వారిని తప్పించి, తమకు నచ్చిన వారిని ఆయా ఉద్యోగాల్లో కూర్చోబెట్టాలని చేస్తున్న కుట్రలు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు.కొత్తూరు వీఓఏగా కక్కల లక్ష్మిని కొనసాగించాలంటూ పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావుకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందచేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ పదేళ్లుగా కొత్తూరు గ్రామా నికి చెందిన వీఓఏ కక్కల లక్ష్మి ప్రభుత్వ పథకాల అమలులో, డ్వాక్రా సంఘాల సభ్యులకు సహాయకారిగా, నామమాత్రపు వేతనంతో బాధ్యతా యుతంగా పనిచేస్తున్నారన్నారు. ఆమెను తొలగించేందుకు టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలన్న దుగ్ధతో టీడీపీ నాయకులు చిన్న ఉద్యోగులను తొలగించాలని చెప్పడం, వారి ఆదేశాలతో అధికారులు గంగిరెద్దుల్లా తలాడిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడి పేద లబతుకులతో ఆటలాడుకుంటే ప్రజాఉద్యమాలతో టీడీపీ నాయకులకు ఊపిరి ఆడకుండా చేస్తామని హెచ్చరించారు. పేదలకు బతుకు ఇచ్చి, పట్టెడు మెతుకులు పెట్టకుండా నోటి దగ్గర కూడు తీసేస్తున్న టీడీపీ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రజలు ఎందుకు అధికారం ఇచ్చారో తెలుసుకుని మెలగాలని కోరారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు జి.సత్యనారాయణ, జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు,పెన్నుల పంపిణీ

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి గ్రామస్తుడు, ఎన్టీపీసీ విశ్రాంత జనరల్ మేనేజర్ కోట్ల కృష్ణమూర్తినాయుడు తన పుట్టినరోజును పురస్కరించుకుని సింగవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు,పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.